పరీక్షా కాలం మొదలు

- పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- మార్చి 17 నుంచి పబ్లిక్ పరీక్షలు
- వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు చర్యలు



ఐ.పోలవరం జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన

ఐ.పోలవరం: విద్యార్థికి పదో తరగతి ఎంతో కీలకం .. ఇదే భవిష్యత్ విద్యకు కీలకం.. ఇందులో వచ్చిన మార్కుల ఆధారంగానే విద్యార్థి ఎటు వైపు వెళ్లాలో నిర్ణయం జరుగుతోంది. అలాంటి పరీక్షలకు సమయం దగ్గర పడుతోంది. దీనితో ఇటు విద్యార్థులు, అటు ఉపాధ్యాయులకు పరీక్షా సమయం మొదలైంది. ముమ్మిడివరం, అమలాపురం నియోజకవర్గాల పరిధిలో ఉన్నత ఫలితాలు సాధించేందుకు ఆయా పాఠశాలల సబ్జెక్ట్ టీచర్లు మండల విద్యాశాఖ అధికారులు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. పదో తరగతి పరీక్షలు మార్చి 17 నుంచి 31 వరకూ జరగనున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ముమ్మిడివరం, అమలాపురం నియోజకవర్గాల్లో మొత్తం 107 ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 7,267 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ఐ.పోలవరం మండలంలో మొత్తం 16 పాఠశాలలకు గాను 757 మంది, ముమ్మిడివరం నగర పంచాయతీ, మండల పరిధిలో 17 పాఠశాలల్లో 831 మంది, కాట్రేనికోన మండలంలో 11 ఉన్నత పాఠశాలల్లో 600 మంది, తాళ్లరేవు మండలంలోని 13 పాఠశాలల్లో 1,559 మంది, అమలాపురం పట్టణ, మండల పరిధిలో 42 పాఠశాలల్లో 2,325 మంది, ఉప్పలగుప్తం మండలంలో ఎనిమిది పాఠశాలల్లో 566 మంది, అల్లవరం మండలంలో 13 పాఠశాలల్లో 629 మంది పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్నారు.

అంతా ఉత్తీర్ణత సాధించేలా..



పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులంతా మంచి ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో ప్రణాళికగా సాగుతున్నాం. ఇందుకు వంద రోజుల యాక్షన్ ప్లాన్ సమర్థవంతంగా నిర్వహిస్తున్నాం. రివిజన్ టెస్ట్‌లు జరుపుతున్నాం. సీ, డీ గ్రేడుల్లో ఉన్న విద్యార్థులు కనీసం 50 శాతం మార్కులు సాధించే విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. –వీధి సురేష్ బాబు, హెచ్‌ఎం, జెడ్పీహెచ్ స్కూల్, ఐ.పోలవరం

వంద రోజుల ప్రణాళిక అమలు

ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా విద్యా శాఖ, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు డిసెంబర్ నుంచే ప్రత్యేక చర్యలు చేపట్టారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా పదో తరగతి విద్యార్థులకు పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు తరగతులు చేపడుతున్నారు. ఇప్పటికే పాఠ్యాంశాల బోధన పూర్తి చేసి విద్యార్థులకు రివిజన్ మొదలు పెట్టారు. పాఠశాలల్లో నిర్వహిస్తున్న పరీక్షల ఆధారంగా సబ్జెక్టుల వారీగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. విద్యార్థులను ఏ, బీ, సీ, డీలుగా విభజించి వారిని సబ్జెక్టు ఉపాధ్యాయులకు దత్తత ఇస్తున్నారు. దానికి అనుగుణంగా తర్ఫీదు ఇచ్చి పరీక్షలను సమర్థంగా ఎదుర్కొనేలా సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం విద్యార్థులకు సంక్రాంతి సెలవులు ప్రకటించారు. పాఠశాలలు మొదలు కాగానే వారిపై మరింత దృష్టి పెట్టాలని విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులకు ఆదేశాలు ఇచ్చారు.

క్లుప్తంగా

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు



విద్యార్థికి ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు ప్రభాకర్

అమలాపురం టౌన్: స్థానిక నాలుగో వార్డులోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు డివిజన్ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. చెవి, ముక్కు, గొంతు, దంత, చర్మ, పిల్లల వైద్య విభాగాలకు చెందిన స్పెషలిస్ట్ వైద్యులు విద్యార్థులకు పరీక్షలు చేశారు. డివిజన్ సత్య సాయి సేవా సంస్థల కో ఆర్డినేటర్, ఈఎన్‌టీ స్పెషలిస్ట్ డాక్టర్ జి.ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో వైద్యులు ఎఎస్ఎన్ మూర్తి, మురళీకృష్ణంరాజు, రేవతి వైద్య సేవలు అందించారు. ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు.

మెప్మా బజార్‌లో విరివిగా విక్రయాలు

అమలాపురం టౌన్: స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటైన మెప్మా బజార్‌లో వినియోగదారులు విరివిగా విక్రయాలు సాగించారు. మెప్మా సిటీ మిషన్ మేనేజర్ మోహన్‌కుమార్ పర్యవేక్షణలో ఏర్పాటైన ఈ బజార్‌ను మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు ప్రారంభించారు. డ్వాక్రా మహిళలు రుణాలు తీసుకుని ఇళ్ల వద్దే కుటీర పరిశ్రమగా వివిధ వస్తువులు తయారు చేసి విక్రయిస్తున్న ఉత్పతులను ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని కమిషనర్ రాజు అన్నారు. శుక్ర, శనివారాల్లో కొనుగోళ్లు ఉంటాయని సిటీ మిషన్ మేనేజర్ మోహన్‌కుమార్ తెలిపారు. మార్కెటింగ్ స్పెషలిస్ట్ మంగాదేవి, మెప్మా జిల్లా కార్యాలయ ప్రతినిధి సీహెచ్ శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ తిక్కిరెడ్డి నేతాజీ, వేంకటేశ్వరస్వామి ఆలయ మాజీ చైర్మన్ కర్రి దత్తుడు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యానికి ఎల్ఐసీ ఎండీఆర్టీ అవార్డు



సుబ్రహ్మణ్యాన్ని ఎండీఆర్టీ అవార్డుతో సత్కరిస్తున్న ఎల్ఐసీ అధికారులు

అమలాపురం టౌన్: అమలాపురం ఎస్ఐబీ బ్రాంచి పరిధిలో ఏజెంట్ పిచ్చిక సుబ్రహ్మణ్యం అరుదైన మిలియన్ డాలర్ రౌండ్ టేబుల్ (ఎండీఆర్టీ) అవార్డును అందుకున్నారు. రాజమహేంద్రవరంలో గురువారం రాత్రి జరిగిన ప్రత్యేక సమావేశంలో సీనియర్ డివిజనల్ మేనేజర్ సంధ్యారాణి చేతుల మీదుగా ఆయన అవార్డు స్వీకరించారు. అంతేకాకుండా ఈ అవార్డు ద్వారా వచ్చే జూన్ 22 నుంచి 25వ తేదీ వరకూ అమెరికాలో జరిగే మిలియన్ డాలర్ రౌండ్ టేబుల్ సమావేశానికి సుబ్రహ్మణ్యం అర్హత సాధించారని అమలాపురం ఎల్ఐసీ బ్రాంచి మేనేజర్ సుధాకరరెడ్డి తెలిపారు. సుబ్రహ్మణ్యం ఎల్ఐసీ ఏజెంట్‌గా చేరిన ఏడాదిలోనే సాధించిన ప్రగతికి ఈ అవార్డుతోపాటు అమెరికా దేశంలో జరిగే రౌండ్ టేబుల్‌లో పాల్గొనే అవకాశం దక్కిందని ఏజెంట్స్ టీమ్ లీడర్ గన్నవరపు వెంకట సుబ్రహ్మణ్యం తెలిపారు.

కాంట్రాక్ట్ కార్మికుల రిలే దీక్షలు

ముమ్మిడివరం: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నగర పంచాయతీ ఇంజినీరింగ్ కాంట్రాక్ట్ కార్మికులు శుక్రవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ఎదుట ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ఎలక్ట్రీషియన్లు, ఫిట్టర్లు, కాంట్రాక్టు కార్మికులంతా దీక్షలో పాల్గొన్నారు. తమ న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ దీక్షల్లో సంఘ అధ్యక్షుడు పెట్టా శివప్రసాద్, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎన్ మునేశ్వరరావులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఎం.శ్రీనివాసరావు, ఎన్.అరుణకుమార్, వి.వెంకటేశ్వరరావు, వైవీ రమణ, ఎస్.అజయ్‌కుమార్, గుత్తుల రమేష్, కె.గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

డీటీగా వెంకటేశ్వరరావు నియామకం

యానాం: యానాం సబ్ తాలూకా కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా ఆర్.జ్యోతి వెంకటేశ్వరరావును నియమిస్తూ శుక్రవారం పుదుచ్చేరి రెవెన్యూ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డిప్యూటీ కలెక్టర్ ఎమ్ఎమ్ వినయరాజ్ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన పుదుచ్చేరి ఎన్నికల శాఖలో విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకూ డీటీగా ఉన్న దండయుతపాణిని కారైకల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయానికి బదిలీ చేశారు. అదే విధంగా తూనికలు కొలతలు శాఖ డీటీ సి.గణేషన్‌ను పుదుచ్చేరి ఎన్నికల శాఖకు బదిలీ చేశారు. సబ్ తాలూకా ఆఫీసులో పనిచేస్తున్న వీవీ రత్నరాణిని పుదుచ్చేరి ఎన్నికల శాఖకు నియమించారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ఉప్పలగుప్తం: గోపవరం గ్రామ పంచాయతీ పరిధి బెస్తావాయి పేటలో ఉన్న చర్చిలో క్రిస్మస్ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు, ఇటీవల కాలంలో బెస్ట్ ఎక్సలెన్స్ డాక్టర్‌గా అవార్డు పొందిన ప్రముఖ వైద్యుడు కారెం రవితేజ పాల్గొన్నారు. కేక్ కట్ చేసి, వైద్యులు రవితేజను దుశ్శాలువాతో సత్కరించారు.

రేపటి నుంచి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు



జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శివన్నారాయణ తదితరులు

తాళ్లరేవు: సంక్రాంతి పండగ సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు ఈ నెల 12, 13 తేదీల్లో తాళ్లరేవులో నిర్వహించనున్నట్లు ముమ్మిడివరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ తెలిపారు. స్థానిక రిజిస్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న క్రీడా ప్రాంగణంలో శుక్రవారం ఆయన పోటీల నిర్వహణా బృందంతో కలసి ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. పండగ సందర్భంగా కోడి పందేలు, పేకాట, ఇతర జూద క్రీడలకు వెళ్లకుండా ఉండాలనే లక్ష్యంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో 20 జట్లు పాల్గొంటున్నాయని, వారికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. 14న మహిళలకు ముగ్గులు పోటీలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో వడ్డి ఏడుకొండలు, టి.ఈశ్వరరావు, వాసంశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోడి పందేల బరులు ధ్వంసం



రోళ్లపాలెంలో కోడి పందేల బరులను ట్రాక్టర్‌తో ధ్వంసం చేయిస్తున్న సీఐ వీరబాబు, ఎస్సై కిశోర్‌బాబు



రెల్లుగడ్డలో సిద్ధమవుతున్న పందెం బరి

అమలాపురం టౌన్: రోళ్లపాలెంలో కొబ్బరి తోటల నడుమ ఖాళీ స్థలంలో కోడి పందేల కోసం సిద్ధం చేసుకున్న బరులను పట్టణ పోలీసులు ట్రాక్టర్‌తో శుక్రవారం సాయంత్రం ధ్వంసం చేశారు. కోడి పందేల నిర్వాహకులు గ్రామంలో 216 జాతీయ రహదారి బైపాస్ రోడ్డును ఆనుకుని దాదాపు ఎకరం భూమిని పూర్తి చదును చేయించుకుని బరులు ఏర్పాటు చేశారు. అక్కడే ఉన్న కొబ్బరి చెట్ల మొదళ్లకు సున్నాలు పూసి ముస్తాబు చేసుకున్నారు. పట్టణ సీఐ పి.వీరబాబు, ఎస్సై కిశోర్‌బాబు, ఆ గ్రామ రెవెన్యూ అధికారుల సమక్షంలో ట్రాక్టర్‌ను ఏర్పాటు చేసి యాంత్రిక నాగలితో దున్నించారు. ఈ స్థలంలో కోడి పందేలు ఆడకుండా చదును చేసిన నేలను దున్నేశారు. ఎక్కడైనా కోడి పందేలు ఏర్పాటు చేస్తే ఇలా ధ్వంసం చేస్తామని సీఐ వీరబాబు హెచ్చరించారు.

బరుల ఏర్పాటు

అల్లవరం: సంక్రాంతి పండగ నేపథ్యంలో కోడి పందేల నిర్వహణకు పందెం బరులను ఆగమేఘాలపై సిద్ధం చేస్తున్నారు. సోమవారం ప్రారంభం కానున్న కోడి పందేలకు మండలంలో రెల్లుగడ్డ, అల్లవరం, దేవగుప్తం, తూర్పులంక, కోడూరుపాడులో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది కొత్తగా తూర్పులంకలో పందేలు నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్నాయి. అలాగే కోడూరుపాడులో దేశికోడు వంతెన వద్ద, ఆకులవారిపాలెం, గుత్తులవారిపాలెంలో ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. రెల్లుగడ్డలో నివాసాలను ఆనుకుని పందేల నిర్వహణకు బరులను సిద్ధం చేశారు.

బంగారు నామం సమర్పణ



తాళ్లరేవులో కేశవస్వామివారికి బంగారు నామాన్ని సమర్పిస్తున్న సూర్యనారాయణ మూర్తి

తాళ్లరేవు: స్థానిక కేశవపురంలో శ్రీదేవీ, భూదేవీ సమేత కేశవస్వామి ఆలయంలో స్వామివారికి గ్రామానికి చెందిన జొన్నలగడ్డ సూర్యనారాయణ మూర్తి బంగారు నామాన్ని సమర్పించారు. శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయ ఈఓ యర్రా వెంకటేశ్వరరావు సూచనలతో అర్చకుడు పెద్దింటి శ్రవణ్‌కుమార్, అధికారులు ప్రసాద్, సత్యనారాయణలకు దానిని అందజేశారు. అనంతరం బంగారు నామాన్ని స్వామివారికి అలంకరించారు. శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ సూర్యనారాయణ మూర్తి గతంలో కూడా రూ.4 లక్షల విలువ చేసే వెండితో రాజేశ్వరి అమ్మవారికి వెండిచీర చేయించారన్నారు. వేద పండితులు మర్ల ఫణిశర్మ, చావలి రవి, అప్పలాచార్యులు పాల్గొన్నారు.

సందడే సందడి

- పలుచోట్ల సంక్రాంతి సంబరాలు
- ఆకట్టుకున్న వివిధ వేషధారణలు



అమలాపురం విద్యానిధి స్కూల్‌లో విద్యార్థుల సందడి



ఆదిత్య స్కూల్‌లో ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ



కోరింగ ఫార్మసీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు

అమలాపురం టౌన్: స్థానిక గొల్లగూడెంలోని ఆదిత్య స్కూల్, డీఎస్పీ కార్యాలయం వద్ద విద్యానిధి స్కూళ్లలో సంక్రాంతి సంబరాలు ఆకట్టుకున్నాయి. ఆదిత్య స్కూల్ ప్రాంగణంలో పల్లెటూరి వాతావరణం సెట్టింగ్ అలరించింది. సంప్రదాయ వేషధారణలో పిల్లలు రంజింపజేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ కుంపట్ల లక్ష్మీదేవి ఆధ్వర్యంలో సంబరాలు జరిగాయి. విద్యానిధి స్కూల్‌లో హరిదాసు, గోదాదేవి, సోదెమ్మ వేషధారణల్లో విద్యార్థులు సందడి చేశారు. పాలు పొంగించి భోగి పండ్లను చిన్నారుల నెత్తిన జల్లి ఆశీర్వదించారు. భోగిమంట, బొమ్మల కొలువు, ప్రభలు తదితర ప్రదర్శనలతో విద్యార్థులు అలరించారు. విద్యానిధి విద్యా సంస్థల చైర్మన్ ఏబీ నాయుడు ఆధ్వర్యంలో ఈ సంబరాలు జరిగాయి.

అమలాపురం రూరల్: కామనగరువు ఆదిత్య స్కూల్‌లో ప్రిన్సిపాల్ రామప్రసాద్ అధ్యక్షతన సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులకు రంగవల్లులు, వన్ మినిట్ గేమ్స్, ఫుడ్ ఫెస్ట్ నిర్వహించారు. చిన్నారులకు భోగిపళ్లు, గొబ్బిళ్ల పండగ నిర్వహించి విశిష్టతను పిల్లలకు వివరించారు. స్కూల్ ఆవరణలో విలేజ్ థీమ్, బొమ్మల కొలువు తదితరాలు ఆకట్టుకున్నాయి. ఆదిత్య విద్యాసంస్థల అధినేత ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ ఎన్.శృతిరెడ్డి, ఆదిత్య జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ చలపతిరావు, పాల్గొన్నారు. గున్నేపల్లి అగ్రహారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సంక్రాంతి సంబరాలు జరిగాయి. ఎస్‌ఎంసీ చైర్మన్ దుర్గా భవాని గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

తాళ్లరేవు: కోరింగ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో కళాశాల చైర్మన్ దున్నా జనార్దనరావు, కరస్పాండెంట్ ప్రగళ్లపాటి కనకరాజు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. వంటల ప్రదర్శన, భోగి మంట చుట్టూ నృత్యాలు ఆకట్టుకున్నాయి. కళాశాల డైరెక్టర్ చిట్టూరి కలికిమూర్తి, ప్రిన్సిపాల్ సువర్ణజ్యోతి, స్కూల్ హెచ్‌ఎం ఉమ, ఏటకొమ్మూరి మాల, పవన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు. పోలేకుర్రు పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ వెంటపల్లి నూకరాజు ఆధ్వర్యంలో 3వ ప్లాస్టిక్ రహిత సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో మహిళలు, బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు బళ్ల సంధ్యారాణి, పంచాయతీ కార్యదర్శి జ్యోతిసుధ, మాజీ సర్పంచ్ దడాల బుజ్జిబాబు, ఉప సర్పంచ్ దడాల గణేష్ పాల్గొన్నారు. తాళ్లరేవు సత్యసాయి హైస్కూల్‌లో కరస్పాండెంట్ పట్టా ఆదినారాయణ వర్మ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు.

సంబరాలను విజయవంతం చేయండి

ఉప్పలగుప్తం: ఎస్.యానం సముద్ర తీరంలో 13, 14, 15, 16 తేదీల్లో జరిగే సంక్రాంతి సంబరాలను ప్రజలు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. ఎస్.యానం బీచ్ వద్ద విలేకర్లతో ఆయన మాట్లాడారు. లేజరో, ప్రసిద్ధ గాయనిలతో పాటలు కచేరి ఉంటాయన్నారు. సంబరాలకు సంబంధించి రూపొందించిన టీజర్‌ను విడుదల చేశారు. పళచోళ్ల పద్మనాభం, దంగేటి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తర ద్వార దర్శనం.. పావన భరితం

- వైభవంగా ముక్కోటి ఏకాదశి
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు



అమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు



బెండమూర్లంకలో ధాన్యలక్ష్మికి పూజలు చేస్తున్న భక్తులు



బండారులంకలో పూల మొక్కల మధ్య వేంకటేశ్వరస్వామి విగ్రహం



అమలాపురంలో వేంకటేశ్వరస్వామికి చామంతి పూజ చేస్తున్న అర్చకులు, ఈఓ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లోని ఆలయాలు కిక్కిరిశాయి. అమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు స్వామివారి దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ ఈఓ యర్రా వెంకటేశ్వరరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ జంగా అబ్బాయి వెంకన్న ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. భక్తులు యిండిగెల శ్రీనివాసరావు బ్రదర్స్, నల్లా శ్రీధర్, నల్లా అజయ్ బ్రదర్స్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. స్వామివారి కల్యాణ మండపంలో స్వామికి ముక్కోటి ఏకాదశి పూజలు జరిగాయి. కోనసీమ కళాకారుల సేవా సంఘం ఆధ్వర్యంలో కోలాటం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం స్వామివారికి గరుడ వాహన సేవ, గ్రామోత్సవం, రాత్రి నుంచి ఆలయ ప్రాంగణంలో స్వామివారి శంఖు చక్రనామ సహస్ర దీపాలంకరణ దేదీప్యమానంగా సాగింది. అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, కోనసీమ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్ల రమణబాబు తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు తిక్కిరెడ్డి నేతాజీ, మోకా వెంకట సుబ్బారావు, కొమ్ముల ఆదిబాబు, కుంచే వెంకన్నబాబు, గోకరకొండ లక్ష్మణరావు, దున్నాల వెంకట స్వామినాయుడు, గన్నవరపు సూర్యభాస్కరరావు, పీబీవీఎల్ఎన్ ఆచార్యులు (అర్చకులు) కూడా భక్తులకు సేవలు అందించారు. ఆలయ కొత్త క్యాలెండర్‌ను పట్టణ ప్రముఖులు, ఈఓ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. అయితే ఆలయ దాతలకు తగిన గౌరవం ఇవ్వలేదన్న ఆరోపణలను ఆలయ అధికారులు ఎదుర్కొన్నారు.

అల్లవరం: బెండమూర్లంకలో బంగారు తిరుపతిగా ప్రసిద్ధి చెందిన శ్రీలక్ష్మీ, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ముక్కోటి వేడుకలను నిర్వహించారు. కొబ్బరి గెలలు, మొక్కలతో ధాన్యం రాశులను అలంకరించి ధాన్యలక్ష్మీ ప్రతిమను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీలక్ష్మీ, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామిని అలంకరించారు. దేవగుప్తంలో కోదండ రామాలయంలో పురోహితులు పోచినపెద్ది సత్తిబాబు ఆధ్వర్యంలో దంగేటి శ్రీను, శ్రీదేవి దంపతులచే పూజలు జరిగాయి. ఇందిరానగర్ రామాలయంలోనూ వేడుకలు నిర్వహించారు.

తాళ్లరేవు: పి.మల్లవరం శ్రీదేవీ, భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో అర్చకులు ఖండవిల్లి రంగాచార్యులు, శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. తాళ్లరేవు కేశవపురంలోని కేశవస్వామివారి ఆలయంలో ఈఓ యర్రా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏకాహం జరిపారు.

ముమ్మిడివరం: స్థానిక కేశవస్వామి, పల్లిపాలెం శ్రీహరిసాకేత వేంకటేశ్వర స్వామివారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ముమ్మిడివారం షిర్డీ సాయి ఆలయం భక్తులతో రద్దీగా మారింది. నియోజకవర్గంలోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు.

తాళ్లరేవు: జార్జిపేట రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో లక్ష తులసి పూజ నిర్వహించారు. ఉప సర్పంచ్ పేర్ని ఆదినారాయణ మూర్తి, ఆలయ కమిటీ చైర్మన్ చోడి శ్రీరామ్మూర్తి, రాయుడు గోవిందు, పెదకాపు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: బండారులంక బిళ్లవారి వీధిలో పద్మావతీ అలివేలు మంగా సమేత వేంకటేశ్వరస్వామి వద్ద పూల మొక్కల ప్రదర్శన ఆకట్టుకుంది. మొక్కలతో అలంకరించిన వినాయకుడు, వేంకటేశ్వరస్వామి, గోవుల ప్రతిమలు ఆకట్టుకున్నాయి. అనంతరం భక్తులకు ఉచితంగా పూల మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లక్కింశెట్టి నిత్యానందం, జాన గణేష్, చింతా ఉమామహేశ్వరరావు, శ్రీనివాస బాలమిత్ర సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



ఏపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఈఓ షేక్ సలీం బాషా

ముమ్మిడివరం: ఏపీటీఎఫ్ (ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్) జిల్లా శాఖ నూతన సంవత్సర డైరీలు, క్యాలెండర్లను డీఈఓ షేక్ సలీం బాషా శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎన్ మున్నేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఉందుర్తి వీర వెంకటరావు, రాష్ట్ర కౌన్సిలర్ జీవీవీ సత్యనారాయణ, పినిపే కృష్ణమూర్తి, మోర్త రాజశేఖర్, గుత్తాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

యాచకులకు దుప్పట్ల పంపిణీ

అమలాపురం టౌన్: ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద యాచకులకు రూరల్ మండలం చిందాడగరువు ఎంపీటీసీ సభ్యురాలు మోటూరి కనకదుర్గ, సామాజిక కార్యకర్త మోటూరి వెంకటేశ్వరరావు దంపతులు దుప్పట్లను పంపిణీ చేశారు. ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు జంగా అబ్బాయి వెంకన్న, మోకా వెంకట సుబ్బారావు తదితరుల చేతుల మీదుగా ఈ పంపిణీ జరిగింది.

పందేలకు అనుమతులు ఇవ్వొద్దని వినతి

అల్లవరం: రెల్లుగడ్డలో కోడి పందేలు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ నడింపల్లి వెంకట సత్యనారాయణరాజు శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు వినతి అందించారు. ఏటా నిర్వహిస్తున్న పందెం బరుల్లో పలు ఘర్షణలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పందేలు నిర్వహించడానికి ఎలాంటి అనుమతులు ఇవ్వరాదని ఆయన కోరారు. పందెం బరులకు అనుమతులు ఇవ్వొద్దని పాలకవర్గం ఫిర్యాదు చేస్తే, మరో వర్గం ఎలాగైనా పందేల నిర్వహణకు బరిని సిద్ధం చేయడం గమనార్హం.

బైండోవర్ కేసులు

తాళ్లరేవు: సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు, జూద క్రీడలు నిర్వహించకుండా ముందస్తుగా సుమారు వంద మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు తహసీల్దార్ పితాని త్రినాథరావు శుక్రవారం తెలిపారు. జూదాల నివారణకు మండల, గ్రామ కమిటీలు వేసి స్థల యజమానులకు నోటీసులు ఇచ్చామన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

ఉప్పలగుప్తం: విలసవిల్లి జగనన్న కాలనీలో రూ.9 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి శుక్రవారం శంకుస్థాపన చేశారు. గ్రామంలో ప్రజల ఇబ్బందుల రీత్యా రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, పుత్సల ఏసు, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

17న పొంగల్ సెలవు

యానాం: పొంగల్‌ను పురస్కరించుకుని యానాం, పుదుచ్చేరి, కారైకల్ రీజియన్లలో అన్ని ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాలకు ఎల్జీ ఆదేశాల మేరకు ఈ నెల 17న సెలవు ప్రకటించినట్లు శుక్రవారం ప్రభుత్వ కార్యదర్శి ఎంపీ హిరాన్ ఓ ప్రకటన విడుదల చేశారు. అదేవిధంగా 16న ఉజ్జహవార్ తిరున్నాల్‌కు సైతం సెలవు ప్రకటించారు. ఫిబ్రవరి 1 శనివారం, 8వ తేదీ శనివారం కాంపన్‌సేటరీ వర్కింగ్ డేస్‌గా ఉంటాయన్నారు.

పర్యాటక శాఖ కార్యదర్శితో భేటీ

యానాం: కేంద్ర పర్యాటక శాఖ అదనపు కార్యదర్శి మోహన్‌బల్లాతో శుక్రవారం పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు భేటీ అయ్యారు. యానాం పర్యాటకాభివృద్ధికి కేంద్రం సహకరించాలని, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.30 కోట్లు, యానాం టవర్ అభివృద్ధికి రూ.15 కోట్లు, రానున్న పుష్కరాల నిర్వహణకు రూ.15 కోట్లు కేటాయించాలని ఆయన కోరారు. జాతీయ రహదారుల శాఖ చైర్మన్ సంతోష్‌కుమార్ యాదవ్‌ను కలుసుకుని 216 జాతీయ రహదారి అభివృద్ధికి నిధులు కోరినట్లు తెలిపారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

కాట్రేనికోన: బాల్య వివాహాలు చట్టరీత్య నేరమని ముమ్మిడివరం సమగ్ర శిశు సంక్షేమ అధికారి ఐ.విమల అన్నారు. కాట్రేనికోన మండల పరిషత్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన కిశోర్ వికాసం శిక్షణ కార్యక్రమం జరిగింది. గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, పాఠశాల ఉపాధ్యాయులు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లకు శిక్షణ ఇచ్చారు. దీనికి జెడ్పీటీసీ నేల కిషోర్‌కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా విమల మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల డ్రాప్ అవుట్స్ తగ్గించాలన్నారు. బాల్య వివాహాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ ఎస్.వెంకటాచలం, ఎంపీపీ పాలెపు లక్ష్మి, వైస్ ఎంపీపీ సానబోయిన నాగేశ్వరరావు, సర్పంచ్ గంటి వెంకట సుధాకర్, సూపర్‌వైజర్లు తులసి, ఎల్‌వీ రమణి తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు అందక అవస్థలు

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీలో రోజూ సేకరించిన చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించే టిప్పర్ల డ్రైవర్లకు వేతనాలు లేక రెండు నెలల నుంచి అవస్థలు పడుతున్నారు. శనివారం నుంచి విధులు నిర్వహించలేమని టిప్పర్ల డ్రైవర్లు మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు శుక్రవారం సాయంత్రం స్పష్టం చేశారు. ఈ మేరకు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఆటో టిప్పర్ల డ్రైవర్ల సంఘం అధ్యక్షురాలు కుంచే అరుణకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. నవంబర్, డిసెంబర్ నెలలకు వేతనాలు సంబంధిత ఏజెన్సీ ద్వారా అందని కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.